జర్నలిస్ట్ వార్త
RNI NO :Title-Code :-TELTEL02102
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
KKR NEWS
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

ప్రచురణ : హైదరాబాద్, | ఆదివారం 24-12-2023 | సంపుటి :01 | ఎడిటర్ : బిర్రు కరుణాకర్ | సంచిక : 02 | పేజీలు : 4 | వెల : 5-00

## వైఎస్సార్‌సీపీ గెలుపు కోసమే పనిచేస్తాం

ఐపాక్ కీలక ప్రకటన



అమరావతి:**జర్నలిస్ట్ వార్త**
ఏపీ రాజకీయాలకు సంబంధించి ఐపాక్ కీలక ప్రకటన చేసింది. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలుపు కోసం తాము పనిచేస్తున్నట్టు చెప్పుకొచ్చింది.
కాగా, ఐపాక్ ట్విట్టర్ వేదికగా..'ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మా వంతు తోడ్పాటు అందిస్తాం. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీతో కలిసి పనిచేస్తున్నాం. 2024 ఎన్నికల్లో? ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గెలుపుకోసమే మేము పనిచేస్తాం' అని స్పష్టం చేసింది.

## ఆటో, క్యాబ్ డ్రైవర్లకు

# న్యాయం చేస్తాం

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో సమస్యలు

సిఎం రేవంత్ రెడ్డితో నేరుగా చర్చించిన డ్రైవర్లు

వారికి అండగా ఉంటామని సిఎం రేవంత్ హామీ

హైదరాబాద్,డిసెంబర్23 **జర్నలిస్ట్ వార్త**
ఆటో, క్యాబ్ డ్రైవర్లకు న్యాయం చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్లకు కష్టాలు మొదలయ్యాయి. దీంతో తమను ఆదుకోవాని వారు కోరుతున్నారు. నాపంల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గిగ్ వర్కర్స్‌తో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి సీఎం రేవంత్ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. ఎన్నికల ముందు గిగ్ అండ్ ఎ÷-లాట్ ఫార్మ్ వర్కర్లకు న్యాయం చేస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు శనివారం ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్విగ్గి, జొమాటో, ఆటో డ్రైవర్లు, గిగ్ ఎ÷-లాట్ ఫార్మ్ కిందకు వచ్చే ఓలా, ఊబర్, ర్యాపిడో, పోర్టర్, స్విగ్గి, జోమాటో తదితర కంపెనీలో పనిచేస్తున్న వర్కర్లు పాల్గొన్నారు. అయితే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యాలు



కల్పించటం వల్ల ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో గిగ్ వర్కర్లు సీఎం రేవంత్‌కు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 20 వేల గిగ్ వర్కర్లు ఉండగా..
తమకి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎంను కోరినట్టు సమాచారం. రాజస్థాన్ తరహా గిగ్ ప్లాట్ ఫార్మ్ కార్మికుల సంక్షేమ బిల్లు తేవాలని వర్కర్లు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో దర్యాప్తు కొనసాగుతోంది:

– సైబరాబాద్ సీపీ



వివరాలు 2లో

## తిరుమలకు పోటెత్తిన భక్తులు

- అర్ధరాత్రి నుంచే వైకుంఠద్వార దర్శనం

-నిత్య కైంకర్యాల తరవాత దర్శనాలకు అనుమతి

-ఉత్తరద్వారా దర్శనంతో పులకించిన భక్తజనం



వివరాలు 2లో

## కొత్త వేరియంట్‌తో కర్నాటక అప్రమత్తం

- వేడుకలకు వచ్చే ప్రయాణికులకు టెస్టులు

-కేరళ నుంచి వచ్చే పర్యాటకులపై దృష్టి



వివరాలు 2లో

# సైబరాబాద్ పరిధిలో పెరిగిన నేరాలు

ఆర్థిక, స్థిరాస్తి నేరాలు ఎక్కువగా నమోదు

- గతేడాదితో పోలిస్తే 8శాతం పెరుగుదల

శాంతిభద్రతల పరిరోణకు ప్రత్యేక చర్యలు

- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడి





హైదరాబాద్,డిసెంబర్23**జర్నలిస్ట్ వార్త**
గత ఏడాదితో పోలిస్తే 8 శాతం క్రైమ్ రెట్ పెరిగిందని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. మరికొద్దిరోజుల్లో కొత్త సంవత్సరంలోకి అడుగితున్న సందర్భంగా 2023 ఏడాదిలో నమోదైన నేరాలపై సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వివరాలు వెల్లడించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈసారి సైబర్ క్రైమ్ కేసులు పెరిగాయని చెప్పారు. అలాగే, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పై హత్యాయత్నం కేసులో సైతం దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. సైబరాబాద్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు మరింత పకడ్బందీగా పని చేస్తామని సీపీ పేర్కొన్నారు. ఆర్థిక, స్థిరాస్తి నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కమిషనరేట్ సిబ్బంది 2 నెలలు సమర్థంగా పని చేశారని అన్నారు. సైబరాబాద్ పరిధిలో ఈ ఏడాదిలో 29156 ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యినట్లు తెలిపారు. ఈ ఏడాది 3432 మందికి శిక్షలు ఖరారు అయినట్లు చెప్పారు. అలాగే 5342 సైబర్ క్రైమ్ కేసులు నమోదు అవగా.. సైబర్ క్రైమ్ ద్వారా రూ.232 కోట్లు మాయం అయినట్లు వెల్లడించారు. దీంట్లో రూ.46 కోట్లు రికవరీ అయినట్లు తెలిపారు. 277 డ్రగ్స్ కేసులు నమోదు అవగా.. 567 మంది అరెస్ట్ అయ్యారన్నారు. డ్రగ్స్ కేసుల్లో ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు లఅయ్యిందన్నారు. 6676 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని.. డ్రగ్స్ కేసుల్లో రూ.27 కోట్లు విలువ చేసే మత్తుపదార్థులు స్వాధీనం చేసుకున్నామన్నారు. 52124 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయని.. ట్రాఫిక్ ఉల్లంఘనల ద్వారా రూ.104 కోట్ల రూపాయల చలాన్‌లు విధించినట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన 24318 మంది డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేశామన్నారు. షి టీమ్స్ ద్వారా 2587 మంది అరెస్ట్ అయ్యారని.. 52 మందిపై పీడీ యాక్ట్ నమోదు అయినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కొనుగోలు కేసు ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉందన్నారు. శ్రీనివాస్ గౌడ్‌పై హత్యాయత్నం కేసులో దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. సిఫార్సు లేఖలపై పోస్టింగ్‌లు ఉండబోవన్నారు. ప్రతి అధికారిపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. కేపీ చౌదరి డ్రగ్స్‌లో విచారణ కొనసాగుతుందని తెలిపారు. కేపీ చౌదరి కన్ఫెస్ చేసిన ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేస్తామని తెలిపారు. లిస్ట్‌లో ఉన్న అందరినీ విచారణకు పిలుస్తున్నామన్నారు. వారు డ్రగ్స్‌తో ఉన్నపుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నామన్నారు. ఎవరిని వదిలిపెట్టమని.. సినిమా వాళ్ళను వదిలి పెడుతున్నామనేది కేవలం ఆరోపణ మాత్రమే అని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి స్పష్టం చేశారు.

## ఎన్నికల హామీలను

# అమలు చేస్తాం



- **ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతాం**
- **అప్పులు ఉన్నా హామీలను నెరవేరుస్తాం**
- **క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పొంగులేటి హామీ**

ఖమ్మం,డిసెంబర్23**జర్నలిస్ట్ వార్త** ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు వందశాతం పూర్తి చేస్తామని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కూసుమంచి మండలం, పాలేరు గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి, క్రిస్టమస్ బహుమతుల పంపిణీ చేశారు. పాలేరు నియోజకవర్గంలో కళ్యాణలక్ష్మి/ శాదిము బారక్ లబ్దిదారులకు చెక్కులు, విద్యుత్ ప్రమా దంలో మృతిచెందిన వారి సంబంధికులకు ఎక్స్ గ్రేషియా చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, ప్రతి ఒక్కరికి మంచి జరుగుతుందని తెలిపారు. అనేకమంది ఇండ్లు అడుగుతున్నారని, ధరణితో ఇబ్బందులు పడుతున్నారని, ఇండ్ల మంత్రిగా, రెవిన్యూ మంత్రిగా అందరికి న్యాయం చేస్తామన్నారు. ప్రతి ఇంటికి ఆరు గ్యారెంటీలు తీసుకొని వెళ్లారని ఆయన అన్నారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పక నెరవేర్చుతామని అన్నారు. అక్రమ కేసులు అన్నింటినీ పరిష్కరిస్తా మన్నారు ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పామని తెలిపినట్లు, ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసినట్లు ఆయన అన్నారు. రెండు మూడు రోజుల్లో తీపి వార్త వింటారని, హామీల్లో కొన్ని అమలుచేయనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం ఆరు లక్షల డెబ్బై ఒక్క వేల 734 కోట్ల రూపాయల
అప్పులు చేసిందని ఆయన అన్నారు. ఇరవై నాలుగు గంటల కరెంట్ ఇస్తున్నామని చెప్పిన గత ప్రభుత్వం 81 వేల కోట్ల రూపాయల అప్పులు చేసి ఒప్పచెప్పినట్లు మంత్రి అన్నారు.

# కొత్త వేరియంట్‌తో కర్నాటక అప్రమత్తం

బెంగళూరు,డిసెంబర్23( కేరళలో కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తితో పక్క రాష్ట్రాల్లో ఆందోళన మొదలయ్యింది. ముఖ్యంగా కర్నాటక అప్రమత్తం అయ్యింది. దేశవ్యాప్తంగా కొవిడ్ కొత్త వేరియంట్ ఇతర రాష్టాల్లో్ పరిస్థితి ఎలా ఉన్నా కర్నాటక రాష్ట్రంలో ముప్పు పొంచి ఉందనే భయం వెంటాడుతోంది. పొరుగు రాష్ట్రం కేరళలోనే ఎక్కువ మందికి వైరస్ ప్రబలు తుండటమే ఆందోళనకు కారణమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ముప్పును ముందస్తుగానే గుర్తించి ప్రత్యేక నిబంధనలు, సౌలభ్యాలను సిద్ధం చేసుకుంటోంది. దక్షిణాదిన చారిత్రాత్మక ఆధ్యాత్మిక కేంద్రాలు, రిసార్టులు కలిగిన రాష్ట్రం కావడంతో పాటు క్రిస్మస్ నుంచి జనవరి ప్రారంభం దాకా గడిపేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు లక్షలాది మంది సిద్ధమయ్యారు. వీరికి తోడు కేరళ నుంచి నిత్యం వేలాది మంది భక్తులు రాష్ట్రానికి వస్తున్నారు. క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకలు వారాంతంలో వచ్చిన మేరకు ప్రత్యేకించి బెంగళూరులో నివసించే లక్షలాది మంది సొంతూళ్లకు వెళ్లి వాపసు వచ్చే వారి ద్వారా వైరస్ తీవ్రం కావచ్చునని అంచనా వేస్తున్నారు. కేరళ నుంచి వచ్చే ప్రధాన రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సాధారణ పరీక్షలు ప్రారంభించారు. వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావు నేతృత్వంలో కొవిడ్ పర్యవేక్షణకు కేబినెట్ సబ్‌కమిటీని నియమించారు. ఇందులో వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాష్ పాటిల్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ఉన్నారు. వీరు డాక్టర్ రవి నేతృత్వంలోని కొవిడ్ టె క్నికల్ కమిటీ సభ్యులతో కలిసి పర్యవేక్షిస్తారు. ప రిస్థితిని బట్టి ఆంక్షలు, సౌలభ్యాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు. కొత్త సంవత్సర వేడుకలు బెంగళూరులో జరుపుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివస్తారు. ఎంజీరోడ్, బ్రిగేడ్, చర్చ్‌స్ట్రీట్‌లో లక్షలాదిమంది పాల్గొని వేడుకలు జరుపుకునే సంప్రదాయం ఉంది. ఇలా పెద్దసంఖ్యలో ప్రజలు గుమికూడితే వైరస్ ప్రబలే అవకాశాలు ఉంటాయనే భయం వైద్యశాఖకు వెంటాడు తోంది. మరో వారంలో వేడుకలు ఉండడంతో ఇప్పుడు రద్దు చేసే పరిస్థితి లేనందున ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయంగా ఏం చేయాలనే ఆలోచనలో ఉంది. ఇదే పరిస్థితి కోరమంగళ, ఇందిరానగర్, ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లోనూ వేడుకలకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. మరోవైపు గోవా రాష్ట్రంలో కొత్త సంవత్సర సందడి ప్రారంభమైంది. ఇప్పటికే దేశవిదేశీయులు లక్షలాది మంది గోవాకు చేరుకున్నారు. గోవాకు రాష్ట్రంలోని ఉత్తరకన్నడ, బెళగావి జిల్లాలు అనుబంధంగా ఉన్నాయి. గోవా నుంచి వెనుతిరిగి వచ్చేవారు రోడ్డు, రైలు మా ర్గాలు కూడా ఇవే కావడంతో అక్కడి నుంచి వచ్చేవారిపై నిఘా పెట్టాలని



వైద్యఆరోగ్యశాఖ భావిస్తోంది. ఇక నిత్యం వేలాది మంది భక్తులు కేరళ నుంచి వస్తున్నందున సరిహద్దుల్లో పరిశీలిస్తున్నారు. చామరాజనగర్ జిల్లాలో తనిఖీలు చేస్తున్నారు. రాష్ట్రంలో చిక్కమగళూరు, కొడుగు, శివమొగ్గ, మండ్య, చామరాజనగర్ జిల్లాలో వందలాది రిసార్టులు ఉన్నాయి. ఇక్కడ వారంతం, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు వేలాది మంది వస్తున్నారు. తొలి విడత కొవిడ్ తరహాలోనే మరోసారి రాజీవ్‌గాంధీ చెస్ట్ ఆసుపత్రిలో అత్యవసరంగా 200 పడకలను సిద్ధం చేశారు. నగర పరిధికే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కొవిడ్ బాధితులను తీసుకువస్తే ఇక్కడే చేర్చదలచారు. ప్రత్యేకంగా డాక్టర్లు, నర్సులను నియమించారు.

# క్రిస్మస్‌కు ముస్తాబైన మెదక్ చర్చి

## - విద్యుద్దీపాలతో ధగధగలు



మెదక్,డిసెంబర్23 ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన, అత్యుత్తమ కట్టడాల్లో ఒక్కటైన మెదక్ సీఎస్ఐ చర్చి క్రిస్మస్ శోభను సంతరించుకున్నది. విదద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు చర్చిలో ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ వేడుకలను కనుల విందుగా జరిపేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసారు. చర్చిని విద్యుత్‌దీపాలతో అంగరంగ వైభవంగా ముస్తాబు చేసారు. 25న జరిగే క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. క్రిస్మస్ వేడుకలకు మెదక్ నుంచే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల నుంచి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు, పర్యాటకులు తరలివస్తుంటారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. ఇక చర్చి ప్రాంగణంలో వివిధ రకాల గృహ అలంకరణ, ఆటబొమ్మల దుకాణాలు వెలిశాయి. రంగుల రాట్నం, మినీ ఈత కొలనులు, జంపింగ్ గేమ్స్, మినీసర్కస్, మినీరైల్, పిల్లలు ఆడుకునే ఆట బొమ్మలను ఏర్పాటు చేశారు. శనివారం నుంచే ప్రార్థనలు మొదలయ్యాయి. వేలాదిగా క్రిష్టియన్లు తరలి వస్తున్నారు.

# పండగవాతావరణం అంతా ఇప్పుడే

## - ధనుర్మాసంతో లోగిళ్లు కళకళ (ఆధ్యాత్మికం )

శ్రీరంగం,డిసెంబర్23 ఇళ్లు దీపకాంతులతో వెలుగొందుతూ పండగ వాతావరణం సంతరించుకునేదీ హరివిల్లు సాక్షాత్కరించేలా లోగిళ్లు రంగురంగుల ముగ్గులతో కళకళలాడేదీ ధనుర్మాసంలోనే. ఈ మాసంలో గోదాదేవి చేపట్టిన వ్రతానికి సాక్షాత్తూ రంగనాథుడే దిగివచ్చాడని చెబుతారు. విష్ణుమూర్తికి ప్రీతిపాత్రమైన ధనుర్మాసంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో సుప్రభాతానికి బదులు తిరుప్పావై సంకీర్తనలు వినిపిస్తాయి. ధనుర్మాసంలో పూజలు చేస్తే కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారు.తమిళనాడు శ్రీవిల్లిపుత్తూరు ప్రాంతంలోని తులసి వనంలో గోదాదేవి అయోనిజగా దర్శనమిచ్చింది. విష్ణుచిత్తుడనే భక్తుడు ఆమెను ప్రేమతో పెంచి పెద్దచేస్తాడు. గోదాదేవి బాల్యం నుంచీ శ్రీరంగనాథుడినే పవిత్రంగా కొలుస్తుండేది. క్రమేణా? ఆ సర్వాంతర్యామినే తన భర్తగా ఊహించుకుంటూ ఆ పరమాత్మడిని పొందడం కోసం ఇంటిని శుభ్రం చేసి, రంగురంగుల ముగ్గులూ పూలతో వాకిలిని అందంగా అలంకరించి ధనుర్మాస వ్రతాన్ని చేపట్టింది. నెలరోజులపాటు పాశు రాలు(భక్తిగీతాలు) ఆలపిస్తూ శ్రీరంగనాథుడికి తానే సరిజోడని మురిసిపోతూ పూలమాలల్ని అల్లి ఆ దేవాధిదేవుడికి అర్పిస్తుండేది. ఓ రోజు విష్ణుచిత్తుడు? శ్రీరంగనాథుడికి అర్పించిన పూలదండల్లో ఓ వెంట్రుకని గమనిస్తాడు. స్వామికి అర్పించేముందు ఆ దండల్ని గోదా ధరిస్తోందని తెలుసుకుని, 'స్వామీ మహాపరాధం జరిగిపోయింది, మమ్మల్ని క్షమించండంటూ వేడుకుంటాడు. 'స్వామి ఆశీర్వాదం స్వీకరించడం వరకే మనకు అర్హత. అంతేగానీ మనం ధరించిన వాటిని రంగనాథునికి అర్పించడం, ఆయనను వరించాలని వ్రతం చేయడం మహాపరాధం' అంటూ గోదాదేవిని మందలిస్తాడు. అయినా పట్టువిడవకుండా వ్రతాన్ని కొనసాగిస్తూ పరమాత్మునికి పట్టపురాణిని అవుతానంటూ ప్రతినబూనింది గోదా. ఒక రోజు శ్రీరంగనాథుడే కలలోకి వచ్చి గోదాదేవితో తన కల్యాణానికి అనుమతి ఇవ్వమని కోరడంతో విష్ణుచిత్తుడు సమ్మతిస్తాడు. తరవాత గోదాదేవి రంగనాథస్వామితో ఐక్యమైపోతుంది. అందుకే కోరిన కోరికలు నెరవేరాలనీ మంచి వరుడు రావాలనీ పెళ్లికాని యువతులు ధనుర్మాసంలో పవిత్రంగా పూజలు చేస్తారని చెబుతారు. గోపికలు రేపల్లెలో కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుడిని భర్తగా పొందినట్లే? గోదాదేవి పాశు రాలతో శ్రీరంగనాథుడిని కొలిచి ఆయన్నే పెళ్లి చేసుకున్నట్లు పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఇంతటి మహిమగల కాత్యాయనీ వ్రతాన్ని పెళ్లీడుకొచ్చిన యువతులు ఇప్పటికీ నిష్ఠతో ఆచరిస్తారు.

# ఆలయాల్లో వైకుంఠ సందడి

ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు
యాదాద్రీశుడిని దర్శించుకున్న మంత్రి తుమ్మల

యాదాద్రి,డిసెంబర్23: తెలంగాణలోని పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాల దగ్గర బారులు తీరారు. యాదగురిగుట్టలో ఉదయం 6.42 గంటలకు ఉత్తర రాజగోపురం చెంత నరసింహుడు మహావిష్ణువు రూపంలో దర్శనమిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కుటుంబసభ్యులతో నరసింహస్వామిని దర్శించుకున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. గరుడ వాహనంపై శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. భద్రాచలంలోనూ అధ్యయనోత్సవాల్లో భాగంగా వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించారు. వైకుంఠ ద్వారం గుండా దర్శనమిస్తున్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వేములవాడ రాజన్న ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా హరిహరులు భక్తులకు దర్శన మిచ్చారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యేలు లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకటస్వామి పాల్గొని, స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిగాయి. వైకుంఠ ఏకాదశికి జిల్లాలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. సిద్దిపేట లోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని మాజీ మంత్రి హరీశ్ రావు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణ కుంభంతో హరీష్ రావుకు స్వాగతం పలికారు. దుబ్బాక పట్టణంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. ఆ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.వరంగల్ జిల్లాలోని ఆలయాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగుతున్నాయి. వరంగల్ చౌరస్తాలోని గీతా భవన్‌లో వేంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కాశిబుగ్గలోని రంగనాయక స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక వరంగల్‌లో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బట్టల బజార్‌లోని బాలానగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు జరుగుతున్నాయి. ఉత్తర ద్వారం గుండా స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

# ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో దర్యాప్తు కొనసాగుతోంది:

## - సైబరాబాద్ సీపీ



హైదరాబాద్: ఎమ్మెల్యేల కొను గోలుకు సంబంధించిన కేసులో దర్యాప్తు కొనసాగు తోందని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడిం చారు. త్వరలో ఈ కేసుపై వివరాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.అలాగే మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. సైబరాబాద్ వార్షిక నేర నివేదికను సీపీ శనివారం విడుదల చేశారు. కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈసారి సైబర్ క్రైమ్ కేసులు పెరిగాయన్నారు. “అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కమిషనరేట్ సిబ్బంది 2 నెలలు సమర్థంగా పని చేశారు. గతేడాది సైబర్ క్రైమ్‌లు కేసులు 4,850 కేసులు ఉంటే.. ఈసారి 5,342 కేసులు నమోదయ్యాయి. రూ.232 కోట్ల నగదు మోసం జరిగింది. డ్రగ్స్ కేసులు ఈ ఏడాది 277 కేసులు నమోదు కాగా.. 567 మందిని అరెస్టు చేశాం. రెండు పీడీ యాక్టులు నమోదు చేసి, రూ.27.82 కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశాం. ఆర్థిక, స్థిరాస్తి నేరాలు కూడా సైబరాబాద్‌లో ఎక్కువగా నమోదవుతున్నాయి. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ ఏడాది మహిళపై నేరాలు పెరిగాయి. అత్యాచారం కేసులు తగ్గాయి. 2022లో 316 అత్యాచారం కేసులు నమోదైతే.. ఈసారి 259 నమోదయ్యాయిరోడ్డు ప్రమాదాలు, హత్యలు, దోపిడీ, చోరీ కేసులు కూడా పెరిగాయి. ఈ ఏడాది 52,124 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైతే.. వాటిలో 1,271 మందికి శిక్షలు పడ్డాయి. సిఫార్సు లేఖలుపై పోస్టింగ్‌లు ఉండబోవు. ప్రతి అధికారిపై పర్యవేక్షణ ఉంటుంది. నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. నూతన సంవత్సర వేడుకల సమయంలో తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు” అని సీపీ అవినాష్ మహంతి హెచ్చరించారు.

# మన్యంలో పెరగిన చలి

అరకులోయలో మంచు దుప్పటి
జిల్లాల్లో పడిపోయిన ఉష్ణోగ్రతలు

విశాఖపట్టణం,డిసెంబర్23 విశాఖ మన్యంలో చలి తీవ్రత తగ్గడంలేదు. చలికితోడు మంచు దట్టంగా కమ్ముకుంటున్నది. ఉదయం తొమ్మిదిన్నర గంటల వరకు పాడేరు, చింతపల్లి, అరకులోయల్లో మంచు దట్టంగా అలముకుంది. అలాగే ఏజెన్సీలోని జి.మాడుగుల, ముంచంగిపుట్టు, పాడేరు, హుకుంపేట ప్రాంతాల్లో వారం రోజులుగా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదవుతున్నది. చింతపల్లిలో 7.2డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జనవరి మొదటి వారం వరకు ఏజెన్సీ వ్యాప్తగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవు తాయని అధికారులు తెలిపారు. అరకులోయలో మంచు అందాలు పర్యాటకులను కనువిందు జేస్తున్నాయి. అరకు నుంచి విశాఖపట్నం వెళ్లే దారిలో కొత్తభల్లుగుడ లోయంతా మంచుతో నిండుకొని పాల సముద్రాన్ని తలపిస్తున్నది. సందర్శకులతో మ్యూజియం, పద్మాపురం గార్డెన్, చాపరాయి కిటకిటలాడింది. దీంతో సందర్శకులు మంచు అందాలను ఆస్వాదిస్తున్నారు. మరోవైపు కోనసీమతో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో గ్రామాల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు వణుకుతున్నారు. దీనికితోడు పొగమంచు ఉండడంతో తెల్లవారు జామునే ఇళ్ల నుంచి రావాలంటే సంకోచిస్తున్నారు. వారం రోజులుగా పగలు కూడా చలిగాలులు వీస్తున్నాయి. దీంతో చలి తీవ్రతతో గ్రామీణ వాసులు గజగజ వణికిపోతు న్నారు. మంచు సైతం కమ్మేస్తోంది. చలికి భయపడి సాయం త్రం 5 నుంచి ఉదయం 8 గంటల వరకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు వెనుకాడుతున్నారు. గ్రామాల్లో ఉదయం, రాత్రుళ్లు చలిమంటలు కన్పిస్తున్నాయి. పెరిగిన చలితో ఉన్ని దుస్తులు, స్వెటర్ల దుకాణాల వద్ద కొనుగోలు దారులతో రద్దీ కన్పిస్తోంది.

# శ్రీశైలంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి



నంద్యాల,డిసెంబర్24: శ్రీశైలం మహాక్షేత్రంలో ముక్కోటి ఏకాదశి మహోత్స వం వైభవంగా జరుగు తోంది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీస్వామి అమ్మవార్లకు విశేష పూజాధికాలు నిర్వహించడం జరిగింది. రావణవాహనసేవలో భక్తులకు స్వామి అమ్మవార్లు దర్శనమిచ్చారు. శ్రీశైలం పురవీధులలో కన్నులపండువగా గ్రామోత్సవం నిర్వహించారు.

# ‘మోదీపై పోటీ చేయండి’

## దీదీకి భాజపా సవాల్



కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికల్లో వారణాసి నియోజకవర్గం నుంచి ప్రధాని మోదీ పై పోటీ చేయాలని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కి భాజపా నేత ఒకరు సవాల్ విసిరారు.“మమతా బెనర్జీ వారణాసి నుంచి ఎందుకు పోటీ చేయరు..? కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీకి బదులు.. ఆమె బరిలో నిల్చోవాలి. మీరు ప్రధాని కావాలని అనుకుంటున్నారు కదా..! అందుకే ప్రధానిపై పోటీ చేయాలి’ అని భాజపా ఎమ్మెల్యే, మహిళా మోర్చా నాయకురాలు అగ్నిమిత్రా పాల్ వ్యాఖ్యలు చేశారు. వారణాసి నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేయాలని దీదీ ప్రతిపాదించినట్లు వచ్చిన వార్తలపై భాజపా నాయకురాలు స్పందిస్తూ మమతకు సవాల్ విసిరారు.కొద్దిరోజుల క్రితం విపక్షాల ‘ఇండియా’ కూటమి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రధాని మోదీ (%ూవీ వీశీఎఱ%)పై ప్రియాంక గాంధీని నిలబెట్టాలని దీదీ ప్రతిపాదించారని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే దీనిపై కాంగ్రెస్ నేతల నుంచి స్పందన రాలేదు. వాస్తవానికి 2019 ఎన్నికల సమయంలోనే వారణాసి నుంచి ప్రియాంక గాంధీని నిలబెడతారనే ప్రచారం జరిగింది. కానీ, ఆ స్థానంలో కాంగ్రెస్.. అజయ్ రాయ్‌ని పోటీకి దించింది. అయితే, ఇటీవల పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రియాంక గాంధీ చురుగ్గా పాల్గొనడంతో మరోసారి ఆమె అభ్యర్థిత్వంపై చర్చ మొదలైంది. ఆ మధ్య దీనిపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ (%ఝఅయిఎ ఝబ్%) మాట్లాడుతూ.. “ఆమె వారణాసి నుంచి పోటీ చేస్తే తప్పకుండా గెలుస్తారు’ అని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ఎదురుచూపు

కామారెడ్డి,డిసెంబర్23 ఈ యేడు ఇంకా పంటల కొనుగోళ్లు పూర్తిగా చేపట్టలేదు. అప్ఉడే యాసంగి మొదలు కానుంది. ఈ యాసంగిలో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 4లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని సంబంధిత శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటి వరకు లక్షఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో వరి రెండు లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా వరినాట్లు పడ్డాయి. శనగ,మొక్కజొన్న,జొన్న పంటలు కూడా వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంటలతో పాటు మినుములు, పెసర్లు లాంటి పంటలను సైతం రైతులు సాగు చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో జిల్లాలో 31,027 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆయకట్టుకు నీటి విడుదల చేసేందుకు నిర్ణయించారు. పోచారం ప్రాజెక్టు కింద 10వేల ఆయకట్టు ఉంది. జనవరి నుంచి నీటి విడుదల చేయనున్నారు. కౌలాస్ ప్రాజెక్టు కింద 9వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కింద నీటి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు, చెరువుల్లో నీరు ఉండడంతో కాలువల కింద ఇప్పటికే తడి ఆరలేదు. త్వరలో నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో వరికి బదులు వేరే పంటలు సాగుచేయడం సాధ్యం కాదని రైతులు అంటున్నారు. బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, జుక్కల్ మండలాల్లో ఆయా ప్రాజెక్టుల కింద వరి ఎక్కువగా సాగు చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు జిల్లాలో 28వేలకు పైగా వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. ఈ బోర్ల కింద కూడా వరినార్లు పోసి ఉంచారు. ఈ యాసంగిలో సుమారు 2 లక్షల ఎకరాలకు పైగానే వరి సాగు కానున్నట్లు తెలుస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పూర్తవడంతో అన్నదాతలు యాసంగి వరి సాగుపై దృష్టి సారించారు. నారుమళ్లు సిద్ధం చేసుకోవడంతో పాటు దుక్కులు దున్నుతున్నారు.

# ఓటరు నమోదుకు చర్యలు

కామారెడ్డి,డిసెంబర్23 అర్హులు ఓటు ను నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. యువ ఓటర్లలో అవగాహన పెరిగి ఓటరుగా అధికసంఖ్యలో పేరున నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు.

ఓటర్ల జాబితాను గరుడ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని, ఓటరు నమోదు పక్రియను నిరంతరంగా కొనసాగించాలని తెలిపారు.

# తిరుమలకు పోటెత్తిన భక్తులు

తిరుమల,డిసెంబర్24:తెలుగు రాష్టాల్లో్ వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకవజాము నుంచి తెరుచుకున్న వైకుంఠ ద్వారం గుండా స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా తిరుమలలో ఏడు కొండలు పూర్తిగా జనంతో నిండిపోయాయి. విఐపీలు, సామాన్యులు అంతా ఉత్తర ద్వార దర్శనం చేసుకొని పరవశించిపోయారు. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా వైకుంఠ ద్వారం తెరుచుకుంది. శనివారం వేకువజామున 1:30 గంటలకు ఆలయ అర్చకులు శాస్తోక్త్రంగా శ్రీవారి ఆలయానిక పక్కనే ఉన్న వైకుంఠ ద్వారం తెరిచారు.ముందుగా శ్రీనివాసుడికి నిత్య కైంకర్యాలు, తిరుప్పావై పఠనం చేసిన తర్వాత భక్తులను వైకుంఠ ద్వారం గుండా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి టిటిడి అధికారులు అనుమతించారు. ఈ సందర్భంగా టిటిడి పాలక మండలి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి పర్వదినంను తిరుమలలో ఘనం నిర్వహిస్తున్నామని అన్నారు. భక్తులంతా చాలా సంతృప్తితో వైకుంఠ ద్వరం గుండా స్వామి వారిని దర్శించి తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్టు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. భక్తులకు సంతృప్తికరంగా దర్శనం కల్పించడంలో టిటిడి సఫలం అయ్యిందన్నారు. టిటిడి ఈవో ఏవి.ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది వైకుంఠ ద్వార దర్శనం 1:40 గంటలకు ప్రారంభమైందన్నారు. మొత్తం 4వేల విఐపి టోకెన్లు జారీ చేయగా 3,850 టికెట్లు మాత్రమే అమ్ముడు పోయినట్టు వెల్లడించారు. వేకువజామున 1:40కి ప్రారంభంమైన విఐపి బ్రేక్ దర్శనాలు ఉదయం 5:15కి ముగిసిందన్నారు. 45 నిమిషాల ముందే సామాన్య భక్తులకు వైకుంఠ ద్వారం గుండా స్వామి వారి దర్శన భాగ్యం కల్పించామని వివరించారు. ప్రతి స్లాట్ కూడా గంటన్నర ముందుగా తీసుకుని వైకుంఠంలో కూర్చోబెట్టి, భక్తులకు దర్శనం చేయించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఒక వేళ భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో వేచి ఉండే పరిస్థితి వస్తే, గంటా, రెండు గంటల కంటే ఎక్కువ సేపు వేచి ఉండే పని ఉండదని, భక్తులందరికి ఆహార పదార్థాలు, కాఫీ, టీ,పాలు అందిస్తున్నామని ఈవో వెల్లడించారు. తిరుపతిలో ఉచిత టోకెన్ల జారీ పక్రియలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూశామన్నారు.

## డ్రగ్స్ తయారీ ముఠా గుట్టురట్టు



ఖమ్మం భ్యూరో జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని అన్నారం గూడెంలోని ఓ గోడౌన్‌లో గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత డ్రగ్‌ను తయారు చేస్తున్నట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులకు తెలిసింది. శనివారం పక్కా సమచారంతో డ్రగ్ కంట్రోలర్ అధికారులు ఆ గోడౌన్‌పై దాడులు నిర్వహించి 4 కోట్ల 35 లక్షల విలువైన ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత డ్రగ్ తయారు చేస్తున్న నిందితులని అదుపులోకి తీసుకుని అధికారులు విచారణ చేస్తున్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుంది

**– పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీరెడ్డి**



వరంగల్ భ్యూరో జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: విద్యార్థులు ఇష్టపడి క్రమశిక్షణతో చదివితే వారికి ఉజ్వల ఏర్పడుతుందని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డాక్టర్ చుక్కా రామయ్య ఫౌండేషన్, మహాత్మ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో 10వ, తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఝాన్సీరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అవరోధించాలని ఆకాంక్షించారు. పాఠశాల దశ నుంచి చదువుపై శ్రద్ధ వహిస్తే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు కుమారస్వామి, గ్రామ సర్పంచ్ కొమురయ్య, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మాచర్ల పుల్లయ్య, గంటా రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరూ పాటించాలి

**జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**



జయశంకర్ భూపాలపల్లి జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ప్రేమ, శాంతి మార్గమైన క్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరూ పాటిస్తూ ప్రశాంతమైన జీవనం సాగించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి మంజూరు నగర్లోని కల్వరి చర్చిలో నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో పాటు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్రైస్తవులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గిఫ్ట్ ప్యాక్ లను పంపిణీ చేశారు.అనంతరం క్రైస్తవులతో కలిసి విందు భోజనంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలో మూడవ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం తనకు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం క్రిస్మస్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచ మానవాళికి బోధిస్తున్న సత్యమైన ఏసుక్రీస్తు ప్రేమని నిరంతరం పాటించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గిఫ్ట్ ప్యాకెట్లు జిల్లా వ్యాప్తంగా పేదలైన క్రైస్తవులకు అందజేస్తున్నామని వివరించారు. క్రైస్తవ ప్రార్థన స్థలాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. క్రైస్తవ స్మశాన వాటిక కోసం అవసరమైన మేర భూ కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మాతాలను సమానంగా గౌరవిస్తూ, క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రతీ నియోజక వర్గానికి 2 లక్షల రూపాయలు, వెయ్యి గిఫ్ట్ ప్యాక్ లను కేటాయించడం జరిగిందని ఆయన అన్నారు. భూపాలపల్లి నియోజక వర్గంలో అదనంగా మరో వెయ్యి గిఫ్ట్ ప్యాక్ లను అందిస్తామని అన్నారు.
మతాల పేరిట కులాల పేరిట ప్రజలను విడగొడుతూ రెచ్చగొట్టే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, దేవాలయాల స్థలాలు మసీదు స్థలాలు, చర్చిల స్థలాలను దోపిడీకి గురికాకుండా కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. దేవాలయాల సొమ్ము ఆశించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.భూపాల్ పల్లి ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయాన్ని గుర్తు చేస్తూ, రాబోయే 5 సంవత్సరాల పాటు 24 గంటలు ప్రజాసేవలో నిజాయితీగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో చెప్పిన ప్రతి మాట, ఇచ్చిన ప్రతి హామీ ఏసుక్రీస్తు ఆశీస్సులతో నెరవేరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పాస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా..!

**– వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి కొండా**

**– శ్రీస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు**



వరంగల్, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ నగరం బట్టల బజారు సమీపంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శనివారం శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ మురళీధర్ సందర్శించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖ, సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో వారి విజయానికి ఓటు వేసి సహకరించిన ప్రజలకు రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణలో వారి సామర్థ్యాన్ని గుర్తించి, తమపై నమ్మకంతో మంత్రి పదవి బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారికి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఎండోమెంట్ పరిధిలో ఉన్న ప్రతీ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముమ్మాటికి పేదల ప్రజల పార్టీనే అన్నారు. కుల, మతాల తారతమ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సరైన పాలన అందిస్తుంది పేర్కొన్నారు. ఏదీ ఏమైనా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాలయాల పునర్నిర్మాణం కొరకు కృషి చేస్తానని తెలిపారు. వారి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, దేవాలయ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దేవాలయంపై రాజకీయం చేయొద్దు

**గండ్ర వెంకటరమణ రెడ్డి**



భూపాలపల్లి, జర్నలిస్ట్ వార్త ప్రతి నిధి: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంపై రాజకీయం చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమ ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం రాత్రికి రాత్రే నిర్మించింది కాదన్నారు. జిల్లా కలెక్టర్‌తో సహా వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో శంకుస్థాపన చేసి, గుడి నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆలయ ఆవరణంలో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం అనేది వ్యక్తిగత అభివృద్ధి కోసం కాదన్నారు. దేవాలయ నిర్వాహకులకు, పూజా విధానాలకు అయ్యే ఖర్చుల నిమిత్తం కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు మీడియా సమక్షంలో వివరించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని రాజకీయం చేయాలనుకుంటున్న వారు గమనించాలన్నారు. ప్రారంభించిన పనులు చిట్టచివరికి పూర్తయ్యే సమయానికి, గుడిపనులు నిలిపి వేయాలంటూ నోటీసులు జారీ చేయడం రాజకీయ కుట్రలో భాగమేనని వారు అభిప్రాయపడ్డారు. దేవాలయ ఆవరణంలో పురుడు పోసుకుంటున్న కుట్ర రాజకీయాలను భూపాలపల్లి జిల్లా ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. వారి వెంట ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు ఉన్నారు.

## 11 ఏళ్ల బాలికను గర్భవతిని చేసిన కామాంధునికి 60 ఏళ్లు జైలు శిక్ష

నల్గొండ భ్యూరో జర్నలిస్ట్ వార్త: పదకొండేళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి, ఆమెపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన కామాంధుడికి శనివారం నల్గొండ జిల్లా అదనపు సెషన్స్ న్యాయమూర్తి తిరుపతి, 60 ఏళ్ల జైలు శిక్ష విధించారు. వివరాల్లోకి వెళితే నల్గొండ శివార్లలో ఉంటున్న బాలికకు నిజాముద్దీన్ అనే 36 ఏళ్ల వ్యక్తి మాయ మాటలు చెప్పి, అత్యా చారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె గర్భవతి అయ్యింది. బాధిత బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు నల్గొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగించారు. నిందితుడు నిజాముద్దీన్ పై పోక్సోతో పాటు పలు కేసులు పెట్టారు. ఈ కేసులో శుక్రవారం న్యాయమూర్తి తీర్పు చెబుతూ పోక్సోతో పాటు మరో రెండు సెక్షన్ల కింద మూడు వేర్వేరు నేరాలకు సంబంధించి ఒక్కొక్క నేరానికి 20 ఏళ్ల చొప్పున 60 ఏళ్ల జైలు శిక్ష విధించారు. ఈ మూడు శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. బాలికకు 10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఇది కాకుండా నేరస్థుడికి 60 వేల రూపాయల జరిమానా విధించారు.

## గండి మైసమ్మ తల్లిని దర్శించుకున్న పరకాల ఎమ్మెల్యే



గీసుగొండ జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామ శివారులోని కోట గండి మైసమ్మ తల్లిని శనివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. వారి వెంట నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

**– 10 లక్షల రూపాయల ఆస్తి నష్టం**

**– ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు**



జర్నలిస్ట్ వార్త భ్యూరో: సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన ఘటన దేవరుప్పుల మండలంలోని ధరవతండ గ్రామం చింతబాయి తండాలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చింతబాయి తండాకు చెందిన కునుసోత్ మధుకర్ ఇంటిలో శుక్రవారం రాత్రి 2 గంటల సమయానికి గ్యాస్ సిలిండర్ ఫైర్ అయ్యి, ఇంట్లో ఉన్న సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో ఉన్న సామాగ్రి, డబ్బులు దాదాపు 10 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు మధుకర్ తెలిపారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న రెవెన్యూ అధికారి దగ్ధమైన ఇంటితో సహా, బాధితునికి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి గురై నివాసం ఉంటున్న ఇల్లు దగ్ధమైన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అర్చకులు, ఫాదర్లు, ఇమామ్లకు వేతనాల పెంపు

**– రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**

**– కేకేకట్ చేసి, దుస్తులు పంపిణీ చేసిన మంత్రి**




వరంగల్ భ్యూరో జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: రాష్ట్రంలోని అర్చకులు, ఫాదర్లు, ఇమామ్లకు త్వరలో గౌరవ వేతనాలు పెంచనున్నట్లు శనివారం రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. వరంగల్ జిల్లా పరిధిలోని అబ్బాస్ ఫంక్షన్ హాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ ముఖ్య అతిధిగా హాజరై కేక్ కట్ చేసి, వేడుకలను ప్రారంభించారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు దుస్తులను పంపిణీ చేశారు. వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత అధికారికంగా నియోజకవర్గంలో చేపట్టిన తొలి సమావేశం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. క్రిస్మస్ పండగ సందర్భంగా ముందస్తుగా వేడుకల నిర్వహణకు ప్రత్యేక కమిటీనీ ఏర్పాటు చేసుకొని నిర్వహించడం జరిగిందన్నారు.
గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న తరుణంలో క్రిస్టియన్ కాలనీలో ఆలయాలు, మసీదులు, స్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లకు సుమారు రూ.400 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. కలెక్టర్, కమీషనర్ల సహకారంతో తూర్పు నియోజక వర్గాన్ని ముందుకు తీసుకెళతానని అన్నారు. ఫాదర్ లు, అర్చకులు, ఇమామ్లకు గౌరవ వేతనాలు పెంచాలనే అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చడం జరిగిందన్నారు. అందుకు అనుగుణంగా రూ: 12 వేలు అందించేలా త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వరంగల్ (తూర్పు)నియోజక వర్గంలో మైనార్టీలు ముందస్తుగా వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేందర్, పోశాల పద్మ, పల్లం పద్మ, మరుపల్ల రవి, గుండు చందనతో పాటు వేడుకల నోడల్ అధికారి కృష్ణారెడ్డి, వివిధ చర్చిలకు చెందిన ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన వరంగల్ పోలీస్ కమిషనర్



వరంగల్, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఇటీవల తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ పదవి బాధ్యతలు చేపట్టి తొలిసారి వరంగల్ జిల్లాకు విచ్చేసిన మంత్రి కొండా సురేఖ మురళీధర్ ని శనివారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల మొక్కను అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఉత్తమ రైతుకు సన్మానం



మహబూబాబాద్ భ్యూరో జర్నలిస్టు వార్త ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోజాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకొని పెద్దవంగర మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన దుంపల వెంకట్రామయ్యను శనివారం లయన్స్ క్లబ్ పెద్దవంగర ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి, ప్రశంస పత్రాన్ని అందజేశారు. అనంతరం రైతు వ్యవసాయ క్షేత్రానికి లైన్స్ క్లబ్ ప్రతినిధులు రైతు పండించే సమీకృత వ్యవసాయ విధానాలను పరిశీలించారు. వ్యవసాయంతో పాటు పాడి పంటలు, కోళ్ల పెంపకం, చాపల పెంపకం పరిశీలించి ఉత్తమ రైతు అవార్డును అందజేసినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సిరి శ్రీనివాస్, డిస్టిక్ హంగర్ కోఆర్డినేటర్ దామర సరేష్ తదితరులు ఉన్నారు


## జాతీయ లోక్ అదాలత్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి

– జిల్లా ప్రధాన న్యాయమూర్తులు




వరంగల్ భ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయ మూర్తులు కే.రాధా దేవి, యం. కృష్ణమూర్తి శనివారం వేర్వేరుగా మీడియా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తులు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలను అనుసరించి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తేదీ 30.12.2023 శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ ను వరంగల్, హనుమకొండ జిల్లాలలో నర్సంపేట, పరకాలలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. కక్షిదారుల వీలును బట్టి తమ కేసులను ఈ రోజు నుండి ఈ నెల 30వ, తారీఖు లోపు ఏ రోజైన రాజీ కుదుర్చుకునేలా ప్రీ లోక్అదాలత్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందువల్ల కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు క్రిమినల్, సివిల్ కేసులు, భూ తగాదాల కేసులు, మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులు, వివాహ, కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్, డిజాస్టర్ మేనేజ్మెంట్ కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, విద్యుత్ చోరీ, కన్సూమర్ ఫోరమ్ కేసులు, ట్రాఫిక్ ఈ-ఛాలన్ కేసులు, ప్రీ- లిటిగేషన్ కేసులు, ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కావున ఈ జాతీయ లోక్ అదాలత్ నందు న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, పోలీసులు సహకరించి, కక్షిదారులు హాజరు అయ్యేలా, తమ తమ కేసులను పరిష్కరించుకునేలా సిద్ధం కావాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు కక్షిదారులు తమ తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులలో తెలియపరిచి, రాజీ కుదుర్చుకోవాలని తెలియజేశారు. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని తెలియజేశారు. ఇప్పటివరకు వరంగల్ జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ లో గుర్తించబడిన కేసులలో మొత్తం 441 పెండింగ్ కేసులలోని, హనుమకొండ జిల్లాలో మొత్తం 852 పెండింగ్ కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశాం అని తెలిపారు. వరంగల్ జిల్లాలో ప్రీ-లిటిగేషన్ ఎలక్ట్రిసిటి కేసులు-3,000, బ్యాంక్ కేసులు - 900, బి.ఎస్.యన్.ఎల్. కేసులు-200. హనుమకొండ లో ప్రి-లిటిగేషన్ కేసులు-265, ఈ కేసులను పరిష్కరించుటకు హనుమకొండ జిల్లాలో-07 బెంచీలను వరంగల్ జిల్లాలో-06 బెంచీలను ఏర్పాటు చేయడము జరిగిందని తెలిపారు. లోక్ అదాలత్ పట్ల ఎటువంటి సలహాలకైననూ, సందేహాలకైననూ, ఏదేని న్యాయసహాయం కు అయిననూ న్యాయ సేవాధికార సంస్థ ను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందవలసిందిగా తెలియజేశారు. ఈ సమావేశాలలో వరంగల్ జిల్లా న్యాయమూర్తి వై.సత్యేంద్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈ.ఆనంద్ మోహన్, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జే.ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# దళిత సర్పంచ్ కి అవమానం



మహబూబాబాద్ భ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో క్రైస్తవ సోదరులకు అధికారికంగా క్రిస్మస్ పండుగ నూతన వస్త్రాల గిఫ్ట్ ప్యాక్ ల పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. శనివారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయ ఆవరణంలో మహబూబాబాద్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ చేతుల మీదుగా గిఫ్ట్ ప్యాక్ లు అందజేస్తారని పంచాయితీ సెక్రెటరీ ముందస్తుగా సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామ సర్పంచ్ దార్ల రామ్మూర్తి జీపీ సిబ్బందితో రోడ్లకు ఇరువైపులా సున్నం పోయించి, ఏర్పాట్లు చేయాగ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నెక్కొండ రోడ్డు వాటర్ ట్యాంకు చర్చి వద్దకు మార్చి కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. ఇనుగుర్తి మండల కేంద్రం లోని మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచైనా తనను కేవలం దళితుడైనందున అవమానించారని వారు ఆరోపించారు. ఎమ్మార్వో, రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే స్థానిక సర్పంచుని ఆహ్వానించకుండానే కార్యక్రమం ముగించుకొని వెళ్ళిపోయరని తెలిపారు. ఎమ్మెల్యేగా భూక్య మురళీ నాయక్ గెలిచిన అనంతరం ఇనుగుర్తిలో పెట్టిన మొదటి కార్యక్రమంలోనే ఇలా సమాచారం ఇవ్వకుండా దళిత సర్పంచుని అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారి ఇనుగుర్తికి వచ్చిన మురళి నాయక్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయకు ఒడా కార్యక్రమాన్ని ని ం ్ వ ి ా ం చ ్ డ ్ ం దురదృష్టకరమన్నారు. సర్పంచైనా తనను, రాజ్యాంగ నిర్మాతను అవమానించిన ఎమ్మెల్యే విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. తనకు సమా చారం ఇవ్వకుండా అధికారిక కార్యక్రమం నిర్వహించిన ఎమ్మార్వో, సంబంధిత రెవెన్యూ అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

## మంటల్లో అంకుర హాస్పిటల్.. భయాందోళనలో స్థానికులు

హైదరాబాద్,: గుడి మల్కాపూర్ లోని అంకుర హాస్పటల్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. హాస్పటల్లోని టాప్ ఫ్లోర్ లోనూ, రూఫ్ లోనూ మంటలు ఎగిసిపడుతున్నాయి ..అక్కడ నుంచి వేగంగా మంటలు కింది అంతస్తులలోకి వేగంగా విస్తరిస్తున్నాయి.స్థానిక జ్యోతినగర్ ప్రాంతంలోని పీవీఎన్ఆర్ ఎక్స్ప్రెస్ వేలోని పిల్లర్ నెంబర్ 68 దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తు న్నారు. .ఐదోఫ్లోర్ నుంచి పదో ఫ్లోర్ వరకు మంటలు అంటుకున్నాయి. పైనుంచి అగ్నికీలలు కిందపడుతున్నాయి. అయితే, అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియ రాలేదు. ఆసుపత్రిలో ఎక్కువగా గర్భిణులు, చిన్నారులు ఉన్నారు. మంటలను గమనించిన హాస్పిటల్ సిబ్బంది పేషెంట్లను వెంటనే బయటకు పంపారు.

హాస్పిటల్ నేమ్ బోర్డుకు మంటలు అంటుకున్నాయి. బోర్డు పక్కనే ఫ్లెక్సీలు అంటుకోవడంతో భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.కాగా: ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సులు ఆరు అంతస్తులో హాస్టల్ నిర్వహిస్తున్నారు. మంటలు వ్యాపించడంతో ఒకేసారి 100 మంది నర్సులు బయటకు వచ్చేశారు. ఈ క్రమంలో వారు తమ సర్టిఫికెట్లను అక్కడే వదిలి వచ్చామని కన్నీటి పర్యంతమయ్యారు. అయితే ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో ఎంతమంది రోగులు హాస్పిటల్లో ఉన్నారని విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది. సంఘటనా స్థలంలో నాలుగు ఫైరింజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది, జీహెచ్ఎంసీ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.
సంఘటనా స్థలానికి చేరుకొని సౌత్, ఈస్ట్జోన్ పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదంలో ఆసుపత్రి హోర్డింగ్‌లు కాలిపోయాయని పోలీసులు తెలిపారు. ఎవరికీ ఏమి కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాష్ట్రంలో భారీగాపడిపోయినఉష్ణోగ్రతలు

- గత ఐదేళ్లతో పోలిస్తే ఈసారి అత్యంత తక్కువగా ఉష్ణోగ్రతలు
-సగటు కనిష్ట ఉష్ణోగ్రత12.4 డిగ్రీల సెల్సియస్
- సాధారణం కంటే 4 డిగ్రీల మేర తగ్గిన కనిష్ట ఉష్ణోగ్రత

. అత్యంత తక్కువగా గిన్నెదారిలో 6.8 డిగ్రీలు

హైదరాబాద్,రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం నమోదు కావాల్సిన సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఐదేళ్లతో పోలిస్తే ఈసారి అత్యంత తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు నెలకొన్నాయి. దీంతో క్రమంగా తగ్గుతూ వస్తున్న ఉష్ణోగ్రతలు ఇప్పుడు మరింత పడిపోయాయి. ఉష్ణోగ్రతల పతనానికి తో డుగా ఉత్తర, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో చలి తీవ్రత పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రత కుమ్రుంభీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెదారిలో 6.8 డిగ్రీ సెల్సియస్ నమోదైంది.

**అంతటా తగ్గుదలే...**

రాష్ట్ర మంతటా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగానే నమోదయ్యాయి. వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సగటు కనిష్ట ఉష్ణోగ్రత 14 డిగ్రీల సెల్సియస్. కానీ ప్రస్తుతం సగటు కనిష్ట ఉష్ణోగ్రత 12.4 డిగ్రీల సెల్సియస్గా నమోదైంది. వాతావరణంలో నెలకొంటున్న మార్పులతో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల వారీగా పరిశీలిస్తే మెదక్, హన్మకొండలో సాధారణం కంటే 4 డిగ్రీల మేర తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్, నల్లగొండ, రామగుండంలో, అదిలాబాద్ కనిష్ట ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల మేర తక్కువగా, ఇతర ప్రాంతాల్లో 2 డిగ్రీల మేర తక్కువగా నమోదై నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

**ఇంకో రెండు రోజులు ఇలానే**

రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో ఇదే తరహాలో వాతావరణం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే ఖమ్మంలో గరిష్ట ఉష్ణోగ్రత 30డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్లో 9.4 డిగ్రీల సెల్సియస్ గా నమోదయ్యాయి.

## క్రిస్టియన్ సోదర సోదరీమణులకు దుస్తులను పంపిణీ



వరంగల్ భ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ప్రారంభించారు.
వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని ఐనవోలు మండలం పున్నేల్ గ్రామ మిషన్ ఇండియా క్యాంప్ లో క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రిస్మస్ విందు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వర్ధన్నపేట మండల పరిధిలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్ కట్రాల గ్రామ శివారులోని ఏసు ప్రార్థన మందిరంలో క్రైస్తవులకు క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రిస్మస్ విందు, దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుని క్రైస్తవులు శాలువాతో సన్మానించారు. అనంతరం వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండలం కొంకపాక గ్రామంలోని చర్చిలో క్రైస్తవులకు ప్రభుత్వం పంపిణీ చేసిన దుస్తులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో కొత్తగా 423 కరోనా కేసులు నలుగురు మృతి

న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 752 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. ఇక శుక్రవారం ఒక్కరోజే కరోనా వల్ల నలుగురు మృతి చెందారు. నిన్నటి కంటే ఈరోజుకి 423 యాక్టివ్ కేసులు పెరిగాయి. కేరళ, కర్ణాటక రాష్ట్రాలలోనే యాక్టివ్ కేసులు పెరిగాయి. కేరళలో 266, కర్ణాటకలో 66 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో శనివారానికి ప్రస్తుతం దేశంలో 3,420 యాక్టివ్ కేసులున్నాయని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది.
కాగా భారత్‌లో జెఎన్.1 సబ్ వేరియంట్ వ్యాప్తి పెరుగుతుండడంతో ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవాలో ఇప్పటివరకు 21 వేరియంట్ కేసులు నమోదయ్యాయి. ఇక కేరళలో కరోనా కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో 2,872 యాక్టివ్ కేసులు ఉన్నాయి. గడచిన 24 గంటల్లో 565 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ తెలిపింది. ఇండియాలో అత్యధికంగా కేరళలో గడిచిన 24 గంటలలో 266 కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో కొత్తగా 8 కేసులు రాగా, ఏపీలో కూడా కొత్తగా 8 కేసులు నమోదయ్యాయి. ఇక నిన్న దేశవ్యాప్తంగా కరోనాతో నలుగురు చనిపోయారు. వారిలో ఇద్దరు కేరళలో చనిపోగా, కర్ణాటకలో ఒకరు, రాజస్థాన్‌లో ఒకరు చనిపోయారు.హారు.




# ఖాన్.సార్" అడ్డాలో ఎగిరిన డైనో సర్ జెండా

డిసెంబర్ 21న కింగ్ ఖాన్ నటించిన డంకీ, డిసెంబర్ 22న డైనోసర్ ప్రభాస్ నటించిన సలార్ సినిమాలు రిలీజ్ అవుతున్నాయి అనగానే ఇండియాస్ బిగ్గెస్ట్ క్లాష్ జరగబోతుంది అనే మాట ఇండియా మొత్తం వినిపించింది.

ఈ ఎపిక్ క్లాష్ గురించి చాలా మంది చాలా రకాలుగా అనుకున్నారు కానీ వార్ ని కంప్లీట్ గా వన్ సైడ్ చేసేసాడు ప్రభాస్. సలార్ సీజ్ ఫైర్ సినిమాతో షారుఖ్ ని ఓవర్ షాడో చేసేసాడు ప్రభాస్. షారుఖ్ ని కెరీర్ పీక్ స్టేజ్ లో ఉండగా ఓవర్ షాడో చెయ్యడం అనేది చిన్న విషయం కాదు. బాలీవుడ్ స్టార్ హీరోల వలన కూడా కానిది ప్రభాస్ చేసి చూపించాడు. డంకీ సినిమా రిలీజ్ కి ముందు నార్త్ లో థియేటర్స్ కి కబ్జా చేసినంత పని చేసారు. నార్త్ లో మల్టీప్లెక్స్ నుంచి నేషనల్ చైన్స్ కి చెందిన సింగల్ స్క్రీన్స్ వరకూ అన్ని సెంటర్స్ లో సలార్ కి థియేటర్స్ ఇవ్వలేదు. దీంతో సోషల్ మీడియాలో పెద్ద రచ్చనే జరిగింది.

థియేటర్స్ దొరకని దగ్గర నుంచి డంకీ సినిమాని తీసేసి సలార్ కి కేటాయించే వరకూ తెచ్చాడు ప్రభాస్. డంకీ డే 1 60 కోట్లైతే ప్రభాస్ అంతకు మూడింతలు కలెక్ట్ చేసాడు. సెకండ్ డే అయితే షారుఖ్ అడ్డా అయిన నార్త్ లో డంకీ సినిమాకి కేవలం 16% ఆకుపెన్సీ మాత్రమే వచ్చింది. మండేకి ఆల్మోస్ట్ అన్ని సెంటర్స్ లో డంకీ సినిమాని సలార్ రీప్లేస్ చేయడం గ్యారెంటీగా కనిపిస్తోంది. షారుఖ్ ని ప్రైమ్ టైమ్ లో తన ఏరియాలోనే బీట్ చేసి ప్రభాస్ యునానిమస్ గా ఇండియన్ బాక్సాఫీస్ కింగ్ గా నిలిచాడు. ఇకపై బాలీవుడ్ హీరోలు ప్రభాస్ తో క్లాష్ కి ఎవరైనా రావాలంటే బాగా అలోచించి నిర్ణయం తీసుకుంటారేమో.




# సలార్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అదుర్స్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'సలార్. దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమాకు అంతటా పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో భారీ ఓపెనింగ్స్ రాబడుతున్నది. అయితే ప్రశాంత్‌నీల్ సినిమాలలో పాటల కంటే బీజీఎం(బ్యాక్ గ్రౌండ్ స్కోర్)కే ఎక్కువ క్రేజ్ ఉంటుదన్న విషయం తెలిసిందే. కేజీఎఫ్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద రికార్డు సృష్టించడానికి కూడా ముఖ్య కారణం బీజీఎం. రాఖీ ఎలివేషన్ అప్పుడు అయిన, గరుడ ఎంట్రీ సీన్ అయిన సినిమాను నడిపించింది బీజీఎం అని చెప్పకతప్పదు.

ఇదిలావుంటే.. లేటెస్ట్‌గా వచ్చిన సలార్‌లో కూడా బీజీఎం ప్రధాన బలంగా పనిచేసింది. ముఖ్యంగా ప్రభాస్ ఎంట్రీ బీజీఎం గూస్ బంప్స్ తెప్పిచింది.

ఇక ఈ సినిమాకు ప్రధాన బలమైన బీజీఎంను తాజాగా చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. 'సౌండ్ ఆఫ్ సలార్' పేరుతో ఈ వీడియోను విడుదల చేయగా.. రవి బస్రూర్ సంగీత సారథ్యంలో రూపొందిన ఈ అద్భుతమైన సౌండ్ ట్రాక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.




# సలార్ మొదటిరోజు కలెక్షన్స్ టాప్

'సలార్' మొదటి రోజు కలెక్షన్ల విషయానికి వస్తే, ప్రభాస్ బాక్స్ ఆఫీస్ దగ్గర తన సత్తా మరోసారి చూపించాడు అని అర్థం అవుతోంది. నైజాం కింగ్ ఎవరంటే ప్రభాస్ అని టక్కున చెప్పేస్తారు, అలా వున్నాయి 'సలార్' మొదటి రోజు కలెక్షన్స్. నైజాం ఏరియాలో మొదటి రోజు సలార్ రూ.22.55 కోట్ల షేర్ కలెక్ట్ చేసి అల్ టైమ్ రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో 'ఆర్ఆర్ఆర్' రూ.23.35 కోట్ల షేర్ తో అగ్రస్థానంలో వుంది. అయితే 'ఆర్ఆర్ఆర్' మల్టీ స్టారర్ సినిమా అందులో రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ఇద్దరు కథానాయకులు, రాజమౌళి దర్శకుడు. ఈ 'సలార్' సినిమా మొత్తం ప్రభాస్ పవర్ మీదే నడిచింది, రెండో స్థానంలో నిలిచింది, ప్రభాస్ సత్తా ఏంటో తెలిసింది. ఇక రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి ఈ సినిమా సుమారు రూ.40 కోట్ల షేర్ కలెక్ట్ చేసినట్టుగా ట్రేడ్ అనలిస్ట్స్ చెపుతున్నారు. అలాగే ప్రపంచం మొత్తం మీద ఈ సినిమా సుమారు రూ.95 కోట్ల షేర్ కలెక్ట్ చేసి నెంబర్ వన్ సినిమాగా నిలిచిందని చెపుతున్నారు. గ్రాస్ పరంగా చూసుకుంటే ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ.180 కోట్లు కలెక్ట్ చేసిందని అంటున్నారు.


# డియర్ దేవా..బాక్సాఫీస్ ఫైర్

## సలార్‌పై చిరు ప్రశంసలు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం సలార్ భారీ అంచనాల నడుమ శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు అంతటా పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో భారీ ఓపెనింగ్స్ రాబడుతున్నది. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు సైతం ఈ సినిమా చూసేందుకు బారులుతీరున్నారు. అయితే ఈ సినిమా చూసిన మెగాస్టార్ చిరంజీవి సలార్‌పై ప్రశంసలు కురిపించాడు. డియర్ దేవా (ప్రభాస్)కి ముందుగా శుభాకాంక్షలు తెలుపుతున్నాను. సలార్ సీజ్ ఫైర్ బాక్సాఫీస్ వద్ద అదరగొడుతుంది. అద్భుతమైన సినిమాను తెరకెక్కించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ కు కుడోస్. పృథ్వీరాజ్ సుకుమారన్, శృతి హాసన్, జగపతి బాబు ఈ సినిమాలో అద్భుతంగా నటించారు. మిగతా టెక్నీకల్ టీం అంతా సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. ప్రతి ఒక్కరికీ అభినందనలు అంటూ చిరు ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. ఇక ఈ మూవీకి చిరు రివ్యూ ఇవ్వడంతో ప్రభాస్ ఫ్యాన్స్ సంతోషంలో మునిగిపోతున్నారు.

# ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై చెర్రీ దంపతులు




టాలీవుడ్ మెగా హీరో రామ్ చరణ్ దంపతులు మరో అరుదైన ఘనత సాధించారు. తాజాగా వీరిద్దరూ ప్రతిష్టాత్మక ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్ పేజీపై దర్శనమిచ్చారు.

అయితే ఇప్పటివరకు ఏ టాలీవుడ్ జంట ఇలా ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్ పేజీపై కనిపించలేదు. మొదటిసారి అరుదైన గౌరవాన్ని అందుకున్నారు రామ్ చరణ్ దంపతులు. దీంతో మెగా ఫ్యాన్స్ సంతోషంలో మునిగిపోతున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్? మీడియాలో వైరల్‌గా మారాయి. ఫోర్బ్స్ మ్యాగజైన్ ఇంటర్వ్యూలో భాగంగా ఈ ఫొటో షూట్ జరుగగా.. సూపర్ కపుల్ అంటూ కవర్ పేజీపై క్యాప్షన్ ఇచ్చారు. ఈ ఫొటోలో పింక్ కలర్ డిజైనర్ డ్రెసుల్లో చరణ్, ఉపాసన ఎంతో అందంగా కనిపిస్తున్నారు.

రామ్ చరణ్. ఉపాసనల లవ్ స్టోరీ, వైవాహిక జీవితంలో ఒకరినొకరు ఎలా సపోర్ట్ చేసుకుంటున్నారు. క్లీంకార వారి జీవితంలోకి వచ్చాక ఎలాంటి మార్పులు వచ్చాయి అనేది ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు ఈ మెగా జంట.